క్లుప్తంగా

17, 18 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం

వలేటివారిపాలెం: మండలంలోని రామచంద్రాపురం, లింగపాలెం గ్రామాల్లో ఈ నెల 17, 18 తేదీల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ షేక్ రఫీక్ అహ్మద్ తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండలంలోని అధికారులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

టంగుటూరు: అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరమని అగ్నిమాపక అధికారి రమణారెడ్డి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం రెండో రోజు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన, కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఏ విధంగా నివారించాలో చేసి చూపించారు. ఒక్కో రోజు ఒక్కో ప్రదేశంలో నిర్వహిస్తామన్నారు. బంగారు బాబు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం

కందుకూరు అర్బన్: అంకమ్మతల్లి ఆలయ పునఃనిర్మాణానికి గొల్ల వెంకటరంగమ్ రూ.25,116 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు ఎనిమిరెడ్డి, మాదాల మాల్యాద్రి, ఆవుల మాధవరావు, వెంకటేశ్వర్లు, మాలకొండయ్య ఉన్నారు.

కొలతల ప్రకారం పనిచేస్తే గిట్టుబాటు కూలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న పీడీ వెంకటరావు

ఉలవపాడు: కూలీలు కొలతల ప్రకారం పనిచేస్తే రూ.272 కూలి వస్తుందని డ్వామా పీడీ వెంకటరావు అన్నారు. మండల పరిధిలోని మోచెర్ల పరిధిలోని తెట్టు చెరువు పూడికతీత పనులను శనివారం ఆయన పరిశీలించారు. పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పనిచేయాలని సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పని ప్రదేశంలో నీరు, షెడ్స్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కూలీలకు పీడీ చేతులమీదుగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందించారు. ఏపీఓ వినయ్, సీటీఏ రమణారెడ్డి, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ మధుబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ బాషా పాల్గొన్నారు.

అర్చకునికి స్వర్ణోత్సవ సన్మానం



సుబ్బయ్య పంతులను సన్మానిస్తున్న దృశ్యం

టంగుటూరు: మండలంలోని జయవరం గ్రామంలో వేంచేసియున్న శ్రీ కోదండరామ స్వామి ఆలయ అర్చకులు సుబ్బయ పంతులుకి సర్పంచి మల్లవరపు పేరమ్మ శనివారం శాలువ, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పేరమ్మ మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామి ఆలయంలో అర్చకులు సుబ్బయ పంతులు 1974 సంవత్సరం నుంచి అర్చకత్వ బాధ్యతలు నిర్వహిస్తూ నేటికి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్నారు. దీంతో స్వర్ణోత్సవ సంవత్సర అన్యబంధం ఆత్మీయ అభినందన సదస్సు నిర్వహించామన్నారు. మల్లవరపు వెంకటరామిరెడ్డి, వేదరమిట్ల భరత్‌రెడ్డి, గ్రామ ప్రజలు పెద్ద పాల్గొన్నారు.

మోడీని గద్దె దింపి దేశాన్ని కాపాడుకుందాం

కందుకూరు అర్బన్: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో మోడీని గద్దె దింపి భారతదేశాన్ని కాపాడుకుందామని శనివారం ప్రచారయాత్ర నిర్వహించారు. సీపీఎం, సీపీఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకూరు మాలకొండయ్య, సీపీఎం సీనియర్ నాయకుడు ముప్పరాజు కోటయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సురేష్ బాబు తదితరులు పాల్ఒగన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

కనిగిరి రూరల్: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, సత్వర వైద్య సేవలందించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి తక్షణ వైద్య సాయం అందించాలని కోరారు. ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానన్నారు. తొలుత మెడిసిన్ స్టోర్ రూం, రిజిస్ట్రార్‌ను, ల్యాబ్‌ను చైర్మన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. దంత వైద్య నిపుణులు, డాక్టర్ స్రవంతి, సూపర్‌వైజర్ బాలుడు, మలేరియా అధికారి రామాంజనేయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు



పథకాల లబ్ధిని వివరిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్



కర్లపాలెం గ్రామంలో జగనన్నే మా భవిష్యత్‌లో పాల్గొన్న నేతలు

కనిగిరి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రతి ఇంట్లో సంక్షేమ పథకాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో జరిగిన జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్ దేవరాజ్, కోఆప్షన్ సభ్యుడు అబ్రహం లింకన్ పాల్గొని ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. కార్యక్రమంలో కన్వీనర్ బొట్టు శ్రీను, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు అరుణోదర్, మన్సూర్ పాల్గొన్నారు. 18వ వార్డుల్లో జరిగిన ×మా నమ్మకం నువ్వే జగన్ । కార్యక్రమంలో వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందచేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందచేసిన సంక్షేమ పథకాల లబ్ధిని తెలిపారు. కన్వీనర్లు, గృహ సారథులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, చెంచులు, ఫణీ, పండ్ల ఖాదర్, అంజమ్మ, దౌలత్ బేగం, జానీ పాల్గొన్నారు. 8వ వార్డులో జరిగిన జగనన్నే మా భవిష్యత్‌లో కౌన్సిలర్ షఫీ జాస్మిన్, కన్వీనర్లు, గృహ సారథులు ఖాదర్‌బాషా, షఫీ పాల్గొనగా, 15వ వార్డులో వైస్ చైర్మన్ మాణిక్యరావు, అబ్రహం లింకన్, పి ప్రభుదాసు, 2వ వార్డులో జేసీఎస్ టౌన్ కన్వీనర్, కౌన్సిలర్ వేల్పుల వెంకటేశ్వర్లు, కన్వీనర్లు ఎస్‌కే షరీఫ్, శ్రీను, తిరుపతయ్య, సుశీల పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలను తెలిపారు. తక్కెళ్లపాడు సచివాలయం పరిధిలోని విజయగోపాలపురం తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ పోతు వెంకట రమణారెడ్డి, ఉప సర్పంచ్ మన్నెం కోటారెడ్డి, కన్వీనర్లు, గృహ సారథులు పి.నవ్య, మన్నెం నాగార్జున నాయకులు పాల్గొన్నారు.

హనుమంతునిపాడు: జగనన్న పాలనలోనే పేదలకు ఆర్థిక భరోసా లభించిందని మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మోరవారిపల్లిలో శనివారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు చదివి అన్ని మీకు వస్తున్నాయా లేదా అడిగి తెలుసుకున్నారు. టీడీపీ హయాంలో జరిగిన అవినీతిని కళ్లకు కట్టినట్లు వివరించారు. అనంతరం నాయకులు జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్‌ను గోడకు అంటిస్తున్నారు. మండల గృ హ సారథుల కన్వీనర్ మద్ది తిరుపతయ్య, యూత్ అధ్యక్షుడు భవనం క్రిష్టారెడ్డి, సర్పంచ్ సంఘ అధ్యక్షుడు ఎస్.మధుసూదన్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కత్తి రాజారావు, సచివాలయ కన్వీనర్లు ఏరువ వెంకటరెడ్డి, పంచాయతీ కన్వీనర్ మోరా ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

గుడ్లూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది. ప్రతి గ్రామంలో సర్పంచ్‌లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాలను తెలియజేశారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



సింగరాయకొండ: మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం



తిమ్మారెడ్డిపాలెంలో మట్టి నమూనా సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



మట్టినమూనా సేకరించే విధానంపై శిక్షణ ఇస్తున్న ఏడీఏ వెంకటరమణ

పీసీపల్లి: భూసార పరీక్షల ఫలితాలకు అనుగుణంగా రైతులు పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చని ఏడీఏ ఈవీ రమణ అన్నారు. మండలంలోని నేరేడుపల్లి రైతుభరోసా కేంద్రంలో శనివారం ఏఓ జి.వెంకటస్వామి అధ్యక్షతన వీఏఏలకు భూసార పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకటరమణ మట్టినమూనా ఎలా సేకరించాలి, రైతుల సమాచారం ఎలా సేకరించాలి, సేకరించిన మట్టి నమూనాలను పరీక్ష కేంద్రానికి పంపే విధానాన్ని వివరించారు. రైతులందరికీ ఉచితంగా మట్టి పరీక్షలు చేసి ధృవీకరణ పత్రాలు ఇస్తామన్నారు.

లింగసముద్రం: రైతులు భూసార పరీక్షలు చేయించుకుని పంటలు సాగు చేస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని కందుకూరు వ్యవసాయ సహాయ సంచాలకుడు ముత్యాల శేషగిరిరావు అన్నారు. మండలంలోని తిమ్మారెడ్డిపాలెం రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాధికారి అబ్రహం లింకన్, నాయకులు కేశంరెడ్డి క్రిష్టారెడ్డి వ్యవసాయ, ఉద్యానవన సహాయకులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవసాయ సిబ్బంది పొలాల్లో మట్టి నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ ఇ. నిర్మలకుమారి తెలిపారు. మండలంలోని కనుమళ్ల గ్రామ ఆర్‌బీకేలో శనివారం మట్టి నమూనా సేకరణపై వ్యవసాయ శాఖ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ నిర్మలకుమారి మాట్లాడుతూ సిబ్బంది 50 శాంపిల్స్ సేకరించి మండల కార్యాలయానికి పంపాలని సూచించారు. ఏఓ కె.వి శేషారెడ్డి, కనుమళ్ల సొసైటీ అధ్యక్షుడు మలినేని వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి: వేసవిలో మట్టి నమూనాల సేకరణ నీడలేనిచోట పంటలు వేసిన చోటకాకుండా బాగా ఆరిన పొలాల్లో సేకరించాలని సింగరాయకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఈ నిర్మలకుమారి వీఏఏ వీఏహెచ్‌లకు సూచించారు. స్థానిక ఒకటో రైతు భరోసా కేంద్రంలో ఏఓ రాము ఆధ్వర్యంలో వేసవిలో మట్టి నమూనాల సేకరణ మరియు పరీక్ష విధానంపై వీఏఏ వీహెచ్‌లకు శనివారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఏడీఏ నిర్మలకుమారి మాట్లాడారు. ఏఓ రాము, వైస్ ఎంపీపీ రావులపల్లి కోటరాజు, పాల్గొన్నారు.

వెలిగండ్ల: భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలని కనిగిరి డివిజన్ ఏడీఏ వెంకటరమణ అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సహాయకులు, ఎంపీఈఓలకు శిక్షణ ఇచ్చారు. ఏఓ టి.శిల్ప, ఎస్ రంగక్రిష్ణ, వీఏఏలు పాల్గొన్నారు.

భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధృవీకరణ పత్రాలు చూపుతున్న నర్రమారెళ్ల గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

పొమూరు: దళితుల భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, గుంటుపల్లి చెంచురామయ్య, సచివాలయ మండల కన్వీనర్ షేక్.ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ నర్రమారెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మండలంలోని ఇనిమెర్ల, గుమ్మనంపాడు వగ్గంపల్లె రెవెన్యూ గ్రామాల పరిధిలో దళితులు సాగుచేసుకుంటున్న భూమిని అక్రమంగా బినామీ పేర్లతో ఆన్‌లైన్ చేయించుకున్నాడన్నారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. నర్రమారెళ్ల గ్రామంలో 68.33 ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ కమిటీ తీర్మానం లేకుండా అక్రమంగా అధికారులను లోబరుచుకుని గ్రామంలో లేని వారి పేరుతో పట్టాలు సృష్టించి ఆన్‌లైన్ చేశారన్నారు. దీనిపై విచారణ జరిపిన గత తహసీల్దార్ ఆ పట్టాలు బోగస్‌వని విచారణలో తేల్చారని, విషయాన్ని కలెక్టర్, రెవెన్యూశాఖ మంత్రి దృష్టికి తీసుకుపోతామన్నారు. కార్యక్రమంలో పావులూరి ఆదినారాయణ, పోకా పరమేశ్వరరావు, చావా సూర్యులు, జి.చెరువు దాసు, గంధం జైపాల్, సాల్మాన్ పాల్గొన్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కందుకూరు: పాలిసెట్‌కు హాజరయ్యే విద్యార్థులకు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు కాలేజీ ప్రిన్సిపాల్ కె.మస్తానయ్య శనివారం తెలిపారు. ఈ నెల 16వ తేదీ నుంచి శిక్షణ తరగతులు ప్రారంభిస్తామని చెప్పారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు కాలేజీలో ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కందుకూరు పాలిటెక్నిక్ కాలేజీలో సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లున్నాయని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాలకొండ ఆదాయం రూ.6,62,901

వలేటివారిపాలెం: మండలంలోని మాలకొండలో మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఆదాయం శనివారం రూ.6,62,901 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కేబీ శ్రీనివాసరావు తెలిపారు. ఆదాయంలో భాగంగా కుంకుమార్చన ద్వారా రూ.23,200, తలనీలాలు రూ.29,040లు, ప్రత్యేక దర్శనం రూ.1,61,900, లడ్డుప్రసాదాలు రూ.1,76,085, అన్నదానం రూ.1,93,488, రూమ్ అద్దెలు రూ.27,120 వచ్చాయన్నారు.

చెరువులో అనధికార చేపల వేట

- గిరిజనుడి అనుమానాస్పద మృతి
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన గిరిజనుడి మృతి ఉదంతం
- అనధికార చేపల వేటలో రెవెన్యూ ఉద్యోగి హస్తం
- మామూళ్ల మత్తులో చోద్యం చూస్తున్న అధికారులు

సింగరాయకొండ: చెరువులో చేపలు పడుతూ గిరిజనుడు అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి రాగా ఈ సంఘటన మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ ఎస్సీ కాలనీ సమీపంలోని అనచెరువు సమీపంలో జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం పాతసింగరాయకొండ ఎస్సీ కాలనీ సమీపంలోని ఇరిగేషన్ శాఖకు చెందిన అన చెరువులో గ్రామానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి కొన్నేళ్లుగా అనధికారికంగా చేపల వేట సాగిస్తున్నాడు. దీనిపై కొంతకాలంగా ఎస్సీ కాలనీవాసులు, ఈ ఉద్యోగి మధ్య వివాదం నడిచింది. గొడవలు జరుగుతున్నా ఇరిగేషన్, పంచాయతీ, మత్స్యశాఖాధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించారు. చివరికి ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమా జోక్యంతో వివాదం సద్దుమణిగింది. ఆ తరువాత కూడా అనుమతులు లేకుండా అన చెరువులో యథేచ్ఛగా చేపలు పట్టుకున్నాడు. చెరువు కింద ఆయకట్టుదారులు పంటలు ఎండిపోయి నష్టపోతున్నా వారికి నీరు ఇవ్వకుండా చేపల పెంపకానికే ప్రాధాన్యం ఇచ్చాడని రైతులు వాపోయారు. ఈ క్రమంలో ఆ ఉద్యోగి ఈనెల 8 వతేది రాత్రి నెల్లూరు జిల్లా కొండాపురం మండలం సాయిపేట పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన పాముల కోటయ్య(45), అతని కుమారుడు, మరి కొంతమందిని తీసుకుని వచ్చి అన చెరువు, బింగినపల్లి చెరువు పరివాహక ప్రాంతంలో చేపలవేట సాగించాడని ఈ క్రమంలో చేపల వేటలో పాల్గొన్న పాముల కోటయ్యకు ప్రమాదవశాత్తు వల అడ్డుపడటంతో మరణించాడని తెలిసింది. దీంతో అప్రమత్తమైన ఆ ఉద్యోగి గుట్టుచప్పుడు కాకుండా కోటయ్య మృతదేహాన్ని సాయిపేటకు తరలించాడని స్థానికులు తెలిపారు. కళ్లముందే తండ్రి చనిపోయి రోదిస్తున్న కోటయ్య కొడుకును బెదిరించి గుండెపోటుతో చనిపోయాడని నమ్మించాడని తెలిసింది.

చేపలు పట్టింది అనచెరువులోనా, బింగినపల్లి చెరువులోనా..

చేపలు పట్టింది అనచెరువులోనా లేక బింగినపల్లి చెరువులోనా అన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. వాస్తవానికి అన చెరువు సుమారు 8 ఎకరాల వైశాల్యంలో ఉన్న చిన్న చెరువు. దీనికి అనుకుని సుమారు 400 ఎకరాల వైశాల్యంలో బింగినపల్లి చెరువు ఉంది. అన చెరువులో లోతు తక్కువ తో పాటు చిన్న చెరువు కావటంతో చేపల పట్టడంలో అనుభవం ఉన్న వ్యక్తులు చనిపోయే అవకాశం లేదని స్థానికులు వాదిస్తున్నారు. వాస్తవానికి కోటయ్య రాళ్లపాడు రిజర్వాయర్ లో చేపలు పట్టిన అనుభవం ఉందని గ్రామస్తులు తెలియజేస్తున్నారు. గత కొంతకాలంగా ఆ ఉద్యోగి అన చెరువును అడ్డం పెట్టుకుని పక్కనే ఉన్న బింగినపల్లి చెరువులో రాత్రివేళ అనధికారికంగా చేపలవేట సాగిస్తున్నాడని ఈ క్రమంలో ఈనెల 8వ తేది రాత్రి పాముల కోటయ్యతో పాటు మరో 14 మందితో చేపల వేట సాగించగా ప్రమాదవశాత్తు కోటయ్య మృతి చెందాడన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనకు సంబంధించి ఇన్‌చార్జి ఇరిగేషన్ ఏఇ మధుబాబును వివరణ కోరగా అన చెరువులో చేపలు పెంచుతున్న విషయం తన దృష్టికి రాలేదని ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. ఎంపిడిఓ షేక్ జమీఉల్లాను వివరణ కోరగా అన చెరువులో చేపలు పట్టుకోవటానికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు. ఎస్సై షేక్ ఫిరోజ్‌ఫాతిమాను వివరణ కోరగా కోటయ్య మృతిపై విచారిస్తున్నామని తెలిపారు.

కల్యాణం..కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

హనుమంతునిపాడు: మండల పరిధి వేములపాడులో శనివారం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అర్చకులు వేదమంత్రాల నడుమ స్వామి కల్యాణం జరిపించారు. గ్రామోత్సవం, మోహినీ ఉత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు చేశారు.

పొగాకు చూర సరాసరి ధర రూ. 113.78

టంగుటూరు: పొగాకు చూర సరాసరి ధర అన్ని పొగాలు వేలాలకి కన్నా అత్యధికంగా స్థానిక వేలం కేంద్రంలో రూ. 113.78 నమోదైందని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో వేలం కేంద్రం పరిధిలో శనివారం అన్ని గ్రామాలకు చెందిన రైతులకు వినూత పద్ధతిలో జరిగిన పొగాకు చూర వేలంలో 516 బేళ్ళను వేలాని తీసుకురాగా వాటిలో 515 కొనుగోలు జరిగగా, 1 బేళ్ల తిరస్కరణ జరిగాయి. గరిష్ట ధర రూ. 135 కాగా, కనిష్ఠ ధర రూ. 56 పలకగా, సరాసరి రూ. 113.78 ధర పలికింది. ఈ వేలంలో మొత్తం 10 మంది వ్యాపారులు పాల్గొన్నారని వేలం నిర్వహనాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

అభివృద్ధికి సమన్వయంతో పనిచేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ గంగసాని లక్ష్మి

పొమూరు: మండల అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో శనివారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగసాని లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పలవురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యలపై సమావేశంలో చర్చించారు. పొమూరు సర్పంచ్ రాగమ్మ, బుక్కాపురం సర్పంచ్ రాధాక్రిష్ణ, ఎంపీటీసీ షేక్.అబ్దుల్, యాదాల సాయికిరణ్, కందుల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వీధిలైట్ల మరమ్మతులు, నూతన లైట్ల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ దృష్టికి తేగా విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఇటీవల కాలిపోయిన 8 ట్రాన్స్‌ఫార్మర్స్ స్థానంలో 4 ఇప్పటికే ఏర్పాటుచేశామని విద్యుత్‌శాఖ ఏఈ జిలానీ తెలపగా త్వరితగతిన మిగిలినవి ఏర్పాటుచేయాలని ఎంపీపీ లక్ష్మి సూచించారు. సీహెచ్‌సీ డాక్టర్ ఖాదర్‌బాషా, పీహెచ్‌సీ డాక్టర్ విజయ్‌కుమార్ ప్రభుత్వ వైద్యశాలల్లో స్కానింగ్, కాన్పులు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ, సర్పంచ్‌లు ప్రభుత్వ వైద్యసేవలు ప్రజలు వినియోగించుకునేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలాలు, శ్మశాన స్థలాల సమస్యను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా తహసీల్దార్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మోపాడు రిజర్వాయర్ నీరు వృథాగా పోతోందని తక్షణం నీటి విడుదలను నిలిపివేయాలని కట్టకిందపల్లె సర్పంచ్ శ్రీనివాసులు సమావేశంలో తెలపగా తక్షణం నీటి విడుదలను నిలిపివేసి వృథాను అరికట్టాలని ఎంపీపీ ఇరిగేషన్ అధికారులకు సూచించారు.

వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

వేసవిలో ఎక్కడా నీటి ఎద్దడి తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీపీ గంగసాని లక్ష్మి పేర్కొన్నారు. చేతిపంపులు, పైప్‌లైన్ల మరమ్మతులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటి ఇక్కట్లు తలెత్తేలా సమాచారం ఉంటే తమ దృష్టికి తేవాలని ఎమ్మెల్యే బుర్రా దృష్టికి తీసుకుపోయి ప్రత్యేక నిధులు మంజూరు చేయించి నీటి సరఫరా చేయిస్తామన్నారు. తహసీల్దార్ మిడసల జ్వాలా నరసింహం, ఎంపీడీఓ ఊట్ల శ్రీనివాసులు, ఈఓఆర్డీ వి.బ్రహ్మానందరెడ్డి, వైస్ ఎంపీపీలు షేక్ రషీద్, ఏసురత్నం, కోఆప్షన్ సభ్యుడు నాయబ్‌రసూల్, ఏఓ కంచం రాధ, సీహెచ్‌సీ డాక్టర్ సుభానీ, ఎంపీటీసీ నాగార్జున, రెక్కల అనితారెడ్డి, గట్లా శివకుమారి, పిరికిటి సుబ్బరత్తమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఆలయ శిల్ప సౌందర్యం అద్భుతం



ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

కందుకూరు అర్బన్: పట్టణంలోని అంకమ్మతల్లిని నరసారావుపేట ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, భార్య సుస్మితరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పునఃనిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని రోజుల నుంచి పనులు చేస్తున్నారు, ఏం శిల్పాలు చేశారో అడిగి తెలుసుకున్నారు. ఆలయ శిల్ప సౌందర్యం చూస్తే పల్లవులు, చాణిక్యులు, చోళ సామ్రాజ్యం నాటి శిల్ప సౌందరాన్ని తలపించేలా ఉందన్నారు. తొలుత వలేటివారిపాలెం మండలంలలోని మాల్యాద్రి లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దివి లింగయ్యనాయుడు, పిడికిటి వెంకటేశ్వర్లు, సర్పంచ్ ఆవుల మాధవరావు, మాదాల మాల్యాద్రి, విశ్రాంత ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణ, షెడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఆలయ చైర్మన్ పాముర్తి మాధవరావు

సింగరాయకొండ: పురాణ ప్రసిద్ధి చెందిన పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వామి వారి గిరి ప్రదక్షిణ, ఆలయంలో ప్రదక్షిణ మార్గంలో రేకుల షెడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పాముర్తి మాధవరావు మాట్లాడుతూ గిరి ప్రదక్షిణకు గ్రామంలో జె.సి.బి ఓనర్లు తమ వంతు సహకారం అందిస్తున్నారని, ఆలయంలో రేకుల షెడ్డును సుమారు 16 లక్షల రూపాయల అంచనా వ్యయంతో దాతల సహకారంతో నిర్మించనున్నట్లు వివరించారు. ఈఓ పి. కృష్ణవేణి, ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు, యన్నాబత్తిన కార్తీక్, కొత్తూరి శ్రీ రంగనాయకులు, మట్టా రమేష్, రాజు వెంకటేశ్వరరెడ్డి, గాదంశెట్టి గుప్తా, ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

విజిలెన్స్ ఆకస్మిక దాడులు



మాట్లాడుతున్న విజిలెన్స్ ఏఎస్ఈ అల్‌ఫ్రాన్స్

మద్దిపాడు: అక్రమ విద్యుత్ వినియోగదారులపై శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. 16 మందిని గుర్తించి, వారికి రూ. 86 వేలు జరిమాన విధించినట్లు విజిలెన్స్ సీపీడీసీఎల్ విభాగం ఎస్ఈ ఎం అల్‌ఫాన్స్ తెలిపారు. 3410 విద్యుత్ కనెక్షన్‌లను తనిఖీ చేశామని అందులో 16 మంది అక్రమంగా విద్యుత్ వినియోగించుకుంటున్నట్లు గుర్తించామన్నారు. ఈఈలు ఎస్‌పీ కిరణ్, టి. శ్రీనివాసరావు, డీఈఈలు కె. శ్రీనివాసరెడ్డి, కె. పిచ్చెయ్య, ఏ. గురునాథం, ఏ. శ్రీనివాసరావు పొదిలి, దొనకొండ, కొనకనమిట్ల, మద్దిపూడి, ముద్దమూరు, చీమకుర్తి ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పదహారు రోజుల ఉత్సవం



సింగరాయకొండ: కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

సింగరాయకొండ: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డు లోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కల్యాణోత్సవం కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి సీతారాముల పదహారు రోజుల పండగ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సీతారాముల వారిని ప్రత్యేకంగా అలంకరించి శాస్త్రోక్తంగా పదహారు రోజుల పండగ కార్యక్రమం నిర్వహించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తుల్లో ప్రదర్శించిన కోలాట సాంస్కృతిక కార్యక్రమం ఆకర్షణీయంగా నిలిచింది. తరువాత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.